క్లుప్తంగా

మహానందీశుడికి పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ముందుగా ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం చేపట్టగా పలు ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

భగవద్గీత సారాంశం తెలుసుకోవాలి



భగవద్గీత అనుబంధు గ్రంథాలను పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

పాములపాడు: ప్రతి ఒక్కరూ భగవద్గీతను తెలుసుకోవాలని త్రైత సిద్ధాత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆత్మకూరు, చింతపల్లి కమిటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మునిదాసు సూచించారు. సోమవారం మండలంలోని మద్దూరు, క్రిష్ణానగర్ గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంపిణీ చేసి, వాటిలోని సారాంశాన్ని వివరించారు. శ్రీకృష్ణుడిని మాత్రమే జగద్గురువుగా ఎందుకు పూజించాలో తెలియజేశారు. కార్యక్రమంలో ఇందూ సేవా సమితి సభ్యులు కుమార్ ఆచారి, నాగమద్దిలేటి, భాస్కర్, పార్థసారధి, మనోహర్, నాగన్న, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలంపాట



వేలంలో పాల్గొన్న అధికారులు రైతులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పలు ఆలయాల భూముల కౌలు వేలపాటలు సోమవారం గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారి నాగప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈర్నపాడు ఈశ్వర, చెన్నకేశవ, కోదండ రామస్వామి ఆలయాలకు చెందిన 43.08 ఎకరాలను రూ.9,57,600, ఓంకార్ సిద్ధేశ్వర స్వామి ఆలయ భూములు 3.51 ఎకరాలను రూ.1,26,500 లకు రైతులు దక్కించుకున్నారు. వేలంపాటల్లో పర్యవేక్షణ అధికారి వి.గోపి పాల్గొన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మహానంది: మహానంది వ్యవసాయ కళాశాలలో మహానంది, పాణ్యం మండలాలకు చెందిన ఎస్సీ మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై సోమవారం శిక్షణ ఇచ్చినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.జయలక్ష్మి తెలిపారు. శిక్షణ అనంతరం కిట్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఫరీదా, డాక్టర్ గురివిరెడ్డి పాల్గొన్నారు.

19న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందికొట్కూరు: ఈనెల 19న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశానికి అధికారులు తప్పని సరిగా హాజరుకావాలన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆత్మకూరు: అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి రణధీర్, నాయకులు మాబాషా, నాగేశ్వరరావు కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ రత్నరాధికకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, వీరన్న, బీఎస్‌వలి, కిరణ్, పాల శివుడు, మహమ్మద్, గణపతి, నబి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ



జూపాడుబంగ్లా: పోతులపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, దుస్తులు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లె నిర్మలమ్మ, వైస్ ప్రెసిడెంట్ శివానందరెడ్డి, హెచ్‌ఎం రవి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో ఒరిగిందేమీ లేదు

- వెన్నుపోటు పుస్తకం ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. వెన్నుపోటు పుస్తకాన్ని ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు వాటిని అమలు చేయకుండా వెన్నుపోటు పొడిచారన్నారు. పాలనను గాలికొదిలి రెడ్‌బుక్ పేరుతో ప్రత్యేక రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి పథకంలో నుంచి ప్రతి తల్లి నుంచి రూ.2వేల చొప్పున పాఠశాల అభివృద్ధికి కేటాయిస్తే.. అవన్నీ జగన్ జేబులోకి వెళ్తున్నాయంటూ గొంతు చించుకున్న నారా లోకేష్.. ఇప్పుడు వసూలు చేస్తున్నవి ఎవరి జేబులోకి వెళ్తున్నాయో చెప్పాలన్నారు. ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయినా గ్రామాల్లో అన్నీ అమలు చేసినట్లు డబ్బా కొట్టుకోవడం సిగ్గుచేటన్నారు.

నేరాంధ్రప్రదేశ్‌గా మార్చేలా ఉన్నారు

కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్‌ను నేరాంధ్ర ప్రదేశ్‌గా మార్చేలా ఉన్నాడని శిల్పా చక్రపాణిరెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పటికే 390 హత్యలు, 203 అత్యాచారాలు, 729 మంది సోషల్ మీడియాకు చెందిన వారిపై దాడులు, పాత్రికేయులపై 69 కేసులు నమోదు చేయడం చూస్తేనే అర్థమవుతుందన్నారు. మద్యం విచ్చలవిడి విక్రయాలు, ఇసుక దందాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అరికట్టడంలో అధికారులు విఫలమయ్యారన్నారు.

గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదం

ఏడాది పాలనలో రూ.150 కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశానని ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చెప్పుకోనవడం హాస్యాస్పదంగా ఉందని శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. ప్రతిసారి విలేకరుల సమావేశం పెట్టి గత ప్రభుత్వంలో ఎక్కడ అభివృద్ధి చేశారంటూ ప్రశ్నించడం బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అలవాటైందన్నారు. ఆయన సొంత గ్రామం వేల్పనూరుతోపాటు ప్రతి గ్రామంలోనూ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆసుపత్రి, పైపులైన్లు, రహదారులు, హెల్త్ సెంటర్ ఇవన్నీ బుడ్డా కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్లు నిందారోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ ఆత్మకూరు, బండిఆత్మకూరు, శ్రీశైలం మండలాల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, అంబాల ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, పాల మహేశ్వర్‌రెడ్డి, నాయకులు దేశం తిరుపంరెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఇంతియాజ్‌ఖాన్, ఇలాయాజ్‌ఖాన్, విజయ్, వెంకటస్వామిగౌడ్, మొమిన్, కుందూరు శివారెడ్డి, కొత్త రామాపురం రామచంద్రుడు, అంజాద్‌అలీ, మున్నీర్‌బాషా, దర్గమ్మ, పార్వతి, షఫీవున్, సురేష్, సుల్తాన్, రాజు, అహ్మద్ హుసేన్, రమేష్, లక్ష్మిరెడ్డి, రఫిక్, బాలస్వామియాదవ్, షఫీవున్ పాల్గొన్నారు.

వివిధ కార్యక్రమాల్లో శిల్పా..

మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆత్మకూరు 7వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్ఎస్ బాషా కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే పట్టణంలోని నిజాముద్దీన్ కుమారుడు మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వెంకటాపురం గ్రామంలోని ముల్లంగి శివరామిరెడ్డి ఇంట్లో జరిగిన శుభ కార్యంలో పాల్గొన్నారు.

కొబ్బరి చెట్లు కూల్చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు

బండి ఆత్మకూరు: తన పొలం గట్టున ఉన్న కొబ్బరి చెట్లను జేసీబీతో కూల్చి నష్టపరిచారని మండలంలోని పార్నపల్లి గ్రామానికి చెందిన రైతు పద్మావతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసింది. సర్వే నెంబర్ 89లో ఉన్న తన 3 ఎకరాల పొలం గట్టుపై కొబ్బరి చెట్లు నాటుకున్నానని, దాదాపు 40 ఏళ్ల వయస్సు ఉన్న కొబ్బరి చెట్లను ఈనెల 9న అదే గ్రామానికి చెందిన ద్వారం సుదర్శన్ రెడ్డి, అతని భార్య పుష్పవతమ్మ జేసీబీతో కూల్చివేసి నష్టపరిచారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. విచారించి చర్యలు తీసుకొని, తనకు న్యాయం చేయాలని కోరింది.

సక్రమంగా విధులు నిర్వహించాలి

ఆత్మకూరు: విధుల పట్ల నిర్లక్ష్యం లేకుండా అంకిత భావంతో పని చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి సూచించారు. సోమవారం స్థానిక డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా చేపట్టారు. ఆమె మాట్లాడుతూ వివిధ ప్రైవేట్ కంపెనీలు నిరుద్యోగుల నైపుణ్యాలను పరీక్షించి ఉద్యోగాలు ఇచ్చాయన్నారు. కంపెనీలో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి క్రమశిక్షణతో మెలిగి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన ఇంటర్వ్యూలలో 134 మంది విద్యార్థులు హాజరు కాగా 74 మంది వివిధ కంపెనీలకు అర్హతలు సాధించారు. వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేశారు.

‘సూపర్ సిక్స్’తో ప్రజలకు వెన్నుపోటు



వెన్నుపోటు పుస్తకావిష్కరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకున్న తర్వాత ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచారని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్ విమర్శించారు. వెన్నుపోటు పుస్తకాన్ని సోమవారం పటేల్ సెంటర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మన్సూర్ మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని మాట తప్పకుండా అమలు చేసి ప్రజల గుండెల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానం సంపాదించుకోగా.. చంద్రబాబు అందుకు విరుద్ధంగా ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేకలేక ఏడాదికే అన్ని వర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కొంటున్నారన్నారు. చంద్రబాబు చేసే మోసాలపై వెన్నుపోటు పుస్తకాన్ని ప్రచురించామని ప్రజలు తెలుసుకుని మరోసారి చంద్రబాబును మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచారం విభాగం అధ్యక్షులు కోకిల రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి, కార్యదర్శి నాగశేనారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు విజయకుమార్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు రాజు, పట్టణ అధ్యక్షులు చరణ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు వలి, మైనార్టీ నాయకులు అబుబక్కర్, జబ్బార్, పట్టణ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఆయా మండలాల నాయకులు కృష్ణారెడ్డి, నాగరాజు, కేశవ్, రవి, కిషోర్, రవి, భార్గవ్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పగిడ్యాల: మండల వ్యవసాయ అధికారిగా మురళీధర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతుకుమార్ అనంతపురం జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎమ్మిగనూరు సాయిల్ టెస్ట్ ల్యాబ్‌లో పనిచేస్తున్న మురళీధర్‌ను అధికారులు నియమించడంతో ఆయన విధుల్లో చేరారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులు నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తుకోవాలని నూతన ఏఓ రైతులకు సూచించారు.

పంచాయతీ కార్యదర్శి బదిలీ



బాధ్యతలు చేపట్టిన ఏఓ మురళీధర్

పగిడ్యాల పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి మంత్రాలయానికి బదిలీ కాగా సోమవారం ఆయనను రిలీవ్ చేసినట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. పగిడ్యాల ఇన్‌చార్జ్ బాధ్యతలు కుపాత ముచ్చుమర్రి పంచాయతీ గ్రేడ్ 3 కార్యదర్శి వీరన్నయాదవ్‌కు అప్పగించినట్లు ఆమె తెలిపారు.

పండ్ల తోటల సాగుతో మెరుగైన లాభాలు



మామిడితోటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ తేజశ్విని

జూపాడుబంగ్లా: పూలు, పండ్లతోటల సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని నందికొట్కూరు హార్టికల్చర్ అధికారిణి తేజశ్విని సూచించారు. సోమవారం ఆమె మిడుతూరు మండలంలోని తిమ్మాపురం రెవెన్యూ పరిధిలో రైతులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, భాస్కర్ తదితరులు సాగుచేసిన మామిడి, చీని తోటలను, జూపాడుబంగ్లా మండలంలోని రైతులు సాగుచేసిన పండ్లతోటలను పరిశీలించి పలు సూచనలిచ్చారు.

ప్రజల వినతులను పరిష్కరించాలి



పీజీఆర్‌ఎస్‌లో తహసీల్దార్, ఎంపీడీఓ

జూపాడుబంగ్లా: ప్రజల నుంచి వచ్చే వినతులను అన్నిశాఖల అధికారులు సకాలంలో పరిష్కరించాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్, ఎంపీడీఓ గోపీకృష్ణ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యయ ప్రయాసాలకోర్చి జిల్లాకేంద్రంలో నిర్వహించే పీజీఆర్‌ఎస్‌కు వెళ్లకుండా మండలకేంద్రంలోనే సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ట్రిపుల్ ఐటీడీఎంలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం

కర్నూలు (సిటీ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం)లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయ యువ క్రీడ ప్రాంగణం (స్పోర్ట్స్ అరీనా), అవుట్ డోర్ జిమ్ మరియు ఫెమినా ఫిట్‌నెస్ సెంటర్ (లేడీస్ జిమ్)లను సోమవారం ఐఐఐటీడీఎం డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఫిట్‌నెస్ సెంటర్లు చక్కగా ఉపయోగపడతాయన్నారు. క్యాంపస్ కమ్యూనిటీలో సమగ్ర శ్రేయస్సు, శారీరక ధృఢత్వం, వినోద అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం వీటిని ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియాశీల జీవనాన్ని ప్రోత్సహించడానికి, ఫిట్‌నెస్ సంస్కృతిని పెంపొందించడానికి, క్యాంపస్‌లోని సభ్యులందరికీ నాణ్యమైన వినోదమాలిక సదుపాయాలను పొందేలా చూసుకోవడానికి ఈ ఆధునిక సౌకర్యాలను ఆలోచనాత్మకంగా అభివృద్ధి చేశామన్నారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విత్తన ఎంపిక ప్రధానం

బండిఆత్మకూరు: తొలకరి వర్షాలు ప్రారంభమయ్యాయి. రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్నారు. విత్తనాలు కొనేందుకు రెడీ అవుతున్న రైతులకు వ్యవసాయాధికారి పవన్‌కుమార్ పలు సూచనలు చేస్తున్నారు. విత్తన ఎంపిక ప్రధానమని, నాణ్యమైన విత్తనాలతోనే అధిక లాభాలు సాధ్యమని చెబుతున్నారు.

- లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. రశీదు తీసుకోవాలి. రశీదు మీద ప్యాకెట్, ల్యాట్ నంబర్ ఉన్నదీ, లేనిదీ చూసుకోవాలి.
- విత్తనాలు సాగుచేసేటప్పుడు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలి. దీనివల్ల తెగుళ్ల వ్యాప్తిని అరికట్టవచ్చు.
- విత్తనాలు కొనుగోలు చేశాక మొలక శాతం పరీక్షించాలి. మొలకశాతం 80 ఉండాలి.
- పొలంలో విత్తనాలు వేసిన నాటి నుంచి పంట ఇంటికి వచ్చే వరకు విత్తనాలకు సంబంధించిన రశీదులు దగ్గర ఉంచుకోవాలి. రైతుకు ఏదైనా నష్టం జరిగితే అవి ఉపయోగపడతాయి.
- లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయరాదు.
- కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, డబ్బాపై సీల్ ఉందా? లేదా అన్నది నిర్ధారించుకోవాలి.
- అరువు పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.
- మొలకెత్తే దశ, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వెంటనే వ్యవసాయశాఖ అధికారులను సంప్రదించాలి.

అన్నదాత సుఖీభవకు 9,734 మంది రైతులు అర్హులు

వెలుగోడు: అన్నదాత సుఖీభవకు వెలుగోడు మండలానికి చెందిన 9,734 మంది రైతులు అర్హులు ఉన్నారని మండల వ్యవసాయ అధికారిని స్వాతి అన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ వీరందరూ పథకం లబ్ధి కోసం వెంటనే ఆయా రైతు సేవ కేంద్రాల్లో ekyc చేయించుకోవాలని తెలియజేశారు. అర్హుల జాబితా ఆయా రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచామన్నారు.

పేదలకు మంచి చేయడమే వికసిత్ భారత్ లక్ష్యం

పాములపాడు: పేదలందరికీ మేలు చేయడమే వికసిత్ భారత్ లక్ష్యమని బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చల్లా దామోదర్‌రెడ్డి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన 11 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమ వారం మండల కేంద్రంలో వారు పర్యటించి మోదీ పాలనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మురళిమోహన్, నాయ కులు గోపాలయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నాగలింగమయ్య, బాలస్వామి, ఆరోగ్యస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

మహానంది: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను అధికారులు స్వాధీనం చేసుకుని పేదలకు పంచాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ డిమాండ్ చేశారు. బుక్కాపురంలో సీపీఐ మండల కార్యదర్శి సామేలు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, గ్రామ కార్యదర్శి రాజేశ్వరయ్య పాల్గొన్నారు.

సన్నబియ్యం ఎందుకివ్వ లేదని ఎమ్మెల్యే ఆగ్రహం

పగిడ్యాల: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన సన్న బియ్యం డీలర్ ఎందుకు ఇవ్వలేదని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొత్త పాలమర్రి, సంకిరేణిపల్లె, పగిడ్యాల గ్రామాల్లో తల్లికి వందనం పథకం కింద లబ్ధిపొందిన పిల్లల తల్లిదండ్రులను ఎమ్మెల్యే కలిశారు. అనంతరం పగిడ్యాల 5వ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సన్న బియ్యానికి బదులు లావు బియ్యం ఉండటంతో అంగన్‌వాడీ కార్యకర్త హైమావతిని ఎమ్మెల్యే ప్రశ్నించారు. డీలర్ ఒగిలి శ్రీనివాసులు లావు బియ్యమే ఇచ్చారని సమాధానం ఇవ్వడంతో విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఎంఈఓలు సుభాన్, మురళీమోహన్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ మధు, ఆర్‌ఐ శ్రీరంగారెడ్డి ఉన్నారు.

ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలి

ఆత్మకూరు: మిడుతూరు మండలానికి లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్), ఎంసీపీఐ(యూ) నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు, లాజరస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ నాగజ్యోతికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు కాపోగు సోమన్న, నరసింహులు, ఎంసీపీఐ(యు) నాయకులు మర్రిస్వామి, లింగాల శ్రీనివాసులు, రైతులు అబ్దుల్లాపురం వెంకటరమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతివిద్యార్థికి తల్లికి వందనం అమలు చేయాలి

ఆత్మకూరు: ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్, మండల అధ్యక్షులు సాయి కోరారు. సోమవారం విద్యార్థులతో కలిసి అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒకటి నుంచి 12వ తరగతి చదువుతున్న ఎంత మంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం పథకం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశి, వెంకట్, చరణ్, మల్లి, ప్రశాంత్ పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఐఏఎస్ అధికారులు



ఐఏఎస్ అధికారులకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను పలువురు ఐఏఎస్ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మధ్యప్రదేశ్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ చైర్మన్ స్మితా భరద్వాజ్, పాండిచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మల్లన్న దర్శనానికి ఆలయ రాజగోపురం వద్దకు రావడంతో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామికి, భ్రమరాంబాదేవికి పూజలు నిర్వహించుకున్నారు. వేద పండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామి వారి శేష వస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపకను అందించి సత్కరించారు.

ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం



ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: లాయర్‌ను నియమించుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. సోమవారం సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. 60 ఏళ్ల వయస్సు పైబడిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదుపాయలు, భోజనాలు గురించి ఆరా తీశారు. జూలై 5న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని, రాజీకాదగిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట న్యాయవాది అరుణ్‌కుమార్ ఉన్నారు.

కిక్కిరిసిన ఏపీజీబీ



కిటకిటలాడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు

జూపాడుబంగ్లా: ఖాతాల్లో తల్లికి వందనం పథకం డబ్బులు పడ్డాయో లేదో చెక్ చేసుకోవడానికి వచ్చిన మహిళలతో సోమవారం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కిక్కిరిసిపోయింది. ఇటీవల పథకం అమలు చేస్తూ ప్రభుత్వం తల్లుల ఖాతాలకు జమ చేసినట్లు ప్రకటించడంతో పలువురు మహిళలు బ్యాంక్ వద్దకు తరలివచ్చారు. బ్యాంకు ఖాతాలో డబ్బు జమ అయినా తల్లులు డ్రాచేసుకునేందుకు ఉత్సుకత చూపారు. బ్యాంకు సిబ్బంది ఓపికతో ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందరి ఖాతాలు పరిశీలించి డబ్బు పడిన వారికి డ్రా చేసి ఇచ్చారు. డబ్బు పడని తల్లులు చంద్రబాబునాయుడును శాపనార్థాలు పెడుతూ ఇంటి ముఖం పట్టారు.

నీటి సమస్యను పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, కాలనీ ప్రజలు

నందికొట్కూరు: తాగునీటి సమస్యను పరిష్కరించాలని బీఎస్ఆర్ నగర్ వాసులు కోరారు. సోమవారం వారు సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కాలనీ వాసులకు మద్దతుగా నాగేశ్వరరావు మాట్లాడుతూ గంటల తరబడి కుళాయిల వద్ద వేచి ఉన్నా బిందె నిండటం లేదన్నారు. తాగునీటితోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. నిరసనల్లో కాలనీ ప్రజలు జీవమ్మ, రాఘవేంద్ర, పక్కిరయ్య, కర్ణమ్మ, లక్ష్మీదేవి, నాగమ్మ, రామాంజనేయులు, స్వాములమ్మ, అంజమ్మ, బాబి పాల్గొన్నారు.

అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు

పగిడ్యాల: స్థానిక విఘ్నేశ్వర ఆలయం వద్ద సోమవారం మృతి చెందిన అనాథకు ముచ్చుమర్రి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. పాలమర్రి గ్రామానికి చెందిన బోయ నాగశేషులు(62) మూడు దశాబ్దాల క్రితం గ్రామం విడిచి వెళ్లాడు. తనవాళ్లు ఎవరూ లేకపోవడంతో గడివేములలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం నందికొట్కూరులోని పగిడ్యాల బస్ ఎక్కబోయి ముచ్చుమర్రి బస్ ఎక్కి కొత్త ముచ్చుమర్రిలో దిగాడు. అక్కడ మూడు రోజుల పాటు ఆంజనేయస్వామి ఆలయం వద్దనే నీరసంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని ఆటోలో పామర్రికి పంపించగా.. మార్గమధ్యలోనే మృతిచెందాడు. కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో వీఆర్వో నాగన్న సమక్షంలో పంచనామా నిర్వహించి పంచాయతీ అధికారుల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కేడీసీసీబీలో సిందూర్ డిపాజిట్ స్కీమ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. సోమవారం మొదటిసారిగా నిర్వహించిన బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో ఆయన పాల్గొని బ్యాంకును లాభాల బాటలో నడిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. 2024–25 సంవత్సరానికి పేరుకుపోయిన రూ.265 కోట్ల బకాయిలను తగ్గించాలన్నారు. ప్రతి రైతును కలసి బకాయిలు వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. 2025–26లో బ్యాంకు టర్నోవర్ రూ.4500 కోట్లకు పెంచాలన్నారు. బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లడం ద్వారా సభ్యులైన పీఏసీఎస్‌లకు 2–3 శాతం డివిడెంటు ఇచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. బ్యాంకులో 333 రోజుల సిందూర్ డిపాజిట్ పథకాన్ని చైర్మన్ ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్‌లకు 6.90, ఇతరులకు 6.40 శాతం వడ్డీరేటు ఉంటుందని, ఈ అవకాశం జూన్ 16 నుంచి జూలై 15 వరకు మాత్రమే ఉందని తెలిపారు. సీఈఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వరరెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ మేనేజర్ నదిమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.